క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.33, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరి బీర 40, క్యాబేజీ 13, క్యారెట్ 47, దొండ 25, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 65, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 40, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా తిమ్మప్ప



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ చిలకలగూడ నూతన ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా తిమ్మప్ప బాధ్యతలు స్వీకరించారు. ట్రాఫిక్ వికేంద్రీకరణలో భాగంగా నూతనంగా చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటయ్యింది. లాలాగూడ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన తిమ్మప్ప చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా తిమ్మప్ప మాట్లాడుతూ.. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక కార్యక్రమాలతో ముందుకు సాగుతామన్నారు. ఎక్కడ కూడా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సులువుగా ప్రజలు రాకపోకలు సాగించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామన్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాల పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఆక్రమణలు కూల్చివేత



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: ప్రధాన రహదారిలోని లోధా అపార్ట్‌మెంట్స్ వద్ద ఆక్రమణలను ఖైరతాబాద్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంలో ఇక్కడి ఆక్రమణల విషయమై పలువురు ఆయనకు ఫిర్యాదు చేయగా వెంటనే తొలగించాలంటూ టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమేష్‌ను ఆదేశించారు. బుధవారం ఫతేనగర్ ఫ్లై ఓవర్ సమీపంలో లోధా అపార్ట్‌మెంట్స్ ప్రహరీని ఆనుకుని ఉన్న పలు డబ్బాలు, ఫెక్సీలతో పాటు ఇతర ఆక్రమణలను తొలగించారు.

పవర్ బోరుకు మరమ్మతు



పవర్ బోరుకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

లాలాపేట: తార్నాక డివిజన్ వ్యాప్తంగా పలు కాలనీలు, బస్తీల్లో నిరుపయోగంగా మారిన పవర్ బోర్లకు మరమ్మతులు చేయాలని సామాజిక కార్యకర్త నేతికార్ మహేశ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. లక్ష్మీనగర్‌లో పాడైన బోరు మరమ్మతు విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం సిబ్బంది వచ్చి మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో వాడుక నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. చాలా కాలంగా పాడైన పవర్ బోరు అందుబాటులోకి రావడంపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

బడిబాటలో ఎర్రమంజిల్ స్కూల్ టీచర్లు

బంజారాహిల్స్: బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరిస్తూ ఓ వైపు అవగాహన కలిగిస్తూ మరో వైపు కొత్త అడ్మిషన్లను నమోదు చేసుకుంటున్నారు. గత మూడు రోజులుగా పాఠశాల ఉపాధ్యాయులు డి. ప్రదీప్ కుమార్, బి. గల్లప్ప, వి. గోపాల్, కె. ఇందిరాజ్యోతి, ఎ.శైలజ తదితరులు పాఠశాల చుట్టుపక్కల బస్తీల్లో ఇంటింటికి తిరుగుతున్నారు. సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాలపై అవగాహన కలిగిస్తున్నారు. ఉచితంగా స్కూల్ డ్రెస్‌తో పాటు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని, అనుభవజ్ఞులైన టీచర్లతో బోధన కొనసాగుతుందని సూచిస్తున్నారు. మీ పిల్లల భవిష్యత్ సర్కారు బడుల్లోనే అంటూ వారిని చైతన్యపరుస్తున్నారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని బడిబయట కాదని పేర్కొంటున్నారు. తప్పనిసరిగా తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని దీని వల్ల ప్రయోజనాలను కూలంకషంగా వివరిస్తున్నారు.

చివరి మజిలీకి దక్కిన స్థలం

- ఓల్డ్‌కస్టమ్స్ బస్తీవాసుల పోరాటానికి విముక్తి
- ఎట్టకేలకు బేగంపేట–బల్కంపేట లింక్‌రోడ్డులోని సబ్‌స్టేషన్ పక్కన స్థలం కేటాయింపు
- రూ.2.95 కోట్లతో ఖబ్రస్తాన్ అభివృద్ధి పనులు షురూ



ఖబ్రస్తాన్ కోసం కేటాయించిన స్థలం ఇదే..

సనత్‌నగర్: చివరి మజిలీకి ఆరడుగుల జాగా కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీ వాసుల కల నెరవేరనుంది. ఎట్టకేలకు బేగంపేట–బల్కంపేట లింక్‌రోడ్డులోని సబ్‌స్టేషన్ పక్కన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) ఆధీనంలో ఉన్న ఖాళీ స్థలాన్ని ఖబ్రస్తాన్‌కు కేటాయించేందుకు అడ్డంకులు తొలగాయి. దీంతో ముళ్లపొదలతో చిట్టడవిని తలపించేలా ఉన్న స్థలంలో అభివృద్ధి పనులు కూడా ప్రారంభం అయ్యాయి. సనత్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఇక్కడి బస్తీవాసుల సౌకర్యార్థం ఖబ్రస్థాన్‌కు స్థలం కేటాయింపుపై దృష్టి సారిస్తూ వచ్చారు. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లతో పాటు ఉన్నతాధికారులతో బేగంపేటలోని పలు ప్రాంతాలను పరిశీలించడంతో పాటు పలు దఫాలు సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో గత కొన్నేళ్ల క్రితమే బేగంపేట–బల్కంపేట లింక్‌రోడ్డులోని సబ్‌స్టేషన్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని ఖబ్రస్తాన్‌కు కేటాయించేందుకు మంత్రి నిర్ణయించారు. హెచ్‌పీఎస్ ఆధీనంలో ఉన్న ఈ స్థలం విషయమై పలుమార్లు ఆ స్కూల్ యాజమాన్యంతో చర్చలు జరుపుతూ వచ్చారు. ఎట్టకేలకు యాజమాన్యాన్ని ఒప్పించడంతో ఆ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు రంగం సిద్ధమవుతుంది.

నాడు ధర్నాలు..లాఠీఛార్జీలు..

ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో ఉండే ముస్లిం కుటుంబాల్లో ఎవరైనా చనిపోతే మాత్రం ఆ కుటుంబ సభ్యులకు



అభివృద్ధి ప్లాన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి

చావే. ఎందుకంటే ఎక్కడ ఖననం చేయాలో అర్థం కాని పరిస్థితి. నగరంలో ఉన్న ఖబ్రస్తాన్‌లకు తీసుకెళ్తే స్థలం లేదంటూ వెనుదిరిగి పంపించేసిన సందర్భాలు అనేకం. దీంతో చేసేదేమీ లేక మృతదేహాలతో ధర్నాలకు దిగి ఇక్కడి ముస్లింలు తమ నిరసనను వ్యక్తం చేసిన పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో లాఠీచార్జీలు, కేసులు సైతం అయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బేగంపేట ప్రాంతంలో పర్యటించిన మంత్రి కేటీఆర్‌కు కూడా తమ మొర వినిపించేలా నిరసనకు దిగారు. ఇలా ఎంతో మందికి తమ గోడు వెళ్లబోసుకుంటూ వచ్చారు. అలాంటి పరిస్థితుల నుంచి విముక్తి కలిగించేలా ఖబ్రస్తాన్‌కు స్థలం కేటాయించడంతో స్థానిక బస్తీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

రూ.2.95 కోట్లతో అభివృద్ధి..

సబ్‌స్టేషన్ పక్కన ఉన్న ఒక ఎకరాల 1100 గజాల స్థలంలో ఖబ్రస్తాన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. అభివృద్ధి కోసం రూ.2.95 కోట్లు కూడా మంజూరైనట్లు తెలిసింది. ఈ క్రమంలోనే అక్కడ గుబురుగా పెరిగిన చెట్లు, ముళ్లపొదలను గత రెండు రోజులుగా తొలగించి స్థలాన్ని చదును చేసే ప్రక్రియను చేపట్టారు. పనులను స్థానిక కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి పర్యవేక్షిస్తున్నారు.

మంత్రి చొరవతోనే..

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో దశాబ్దాల నాటి ముస్లిం సోదరుల కల నెరవేరుతుంది. కమిట్‌మెంట్ ఉన్న నేత ఎమ్మెల్యేగా ఉండడం మనందరి అదృష్టం. ప్రజలకు ఇచ్చిన హామీని ఎంత దూరమైనా వెళ్లి నెరవేరుస్తారని మంత్రి మరోసారి రుజువు చేశారు. స్థలం కేటాయించడంతో పాటు అభివృద్ధి పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి.

–మహేశ్వరిశ్రీహరి, బేగంపేట కార్పొరేటర్

ఆనందంగా ఉంది..

ఖబ్రస్థాన్‌కు స్థలం కేటాయించి అభివృద్ధి పనులు కూడా చేయడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా కలెక్టర్‌చే అధికారికంగా ఉత్తర్వులు వెలువడేలా చర్యలు తీసుకుంటే ఇంకా బాగుంటుంది.

–సలీంఖాన్, ఖబ్రస్థాన్ కమిటీ అధ్యక్షుడు

తీరిన చిన్నమ్మ తోట నీటి కష్టాలు



పవర్‌బోర్‌వెల్ నీటిని ప్రారంభిస్తున్న సరిత

రసూల్‌పురా: గత కొన్నేళ్లుగా తిరుమలగిరి చిన్నమ్మ తోట ప్రజలు పడుతున్న నీటి కష్టాలు ఎట్టకేలకు తీరాయి. బస్తీ వాసుల నీటి అవసరాలు తీర్చేందుకు దివంగత ఎమ్మెల్యే సాయన్న నిధులతో పవర్ బోర్‌వెల్ వేసినా విద్యుత్ కనెక్షన్, మోటారు బిగించకపోవడంతో వేసవిలో నీటి కోసం అనేక కష్టాలు పడ్డారు. బీఆర్‌ఎస్ మహిళ అధ్యక్షురాలు నాగినేని సరిత సాయన్న కుమార్తెల దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో ఇటీవల బోర్డు సీఈవో మధుకర్‌నాయక్, జలమండలి సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ ను కలిసి సమస్యను వివరించారు. బోర్డు జలమండలి సిబ్బంది బుధవారం పవర్‌బోర్‌వెల్‌కు నూతన మోటార్, విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో బుధవారం సరిత బోర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సునీత రాజేశ్వరి,గాయత్రి, స్వాతి, క్రిస్టీనా, లత, కవిత, బాగ్య, స్వరూప పాల్గొన్నారు.

బస్టాప్ ఏర్పాటుకు కృషి చేస్తా



మహిళలు,యువతులతో మాట్లాడుతున్న క్రిశాంక్

రసూల్‌పురా: అన్నానగర్ చౌరస్తాలో బస్టాప్ ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ హామీ ఇచ్చారు. ఇటీవల ఆయన నిర్వహించిన బస్తీనిద్ర, కేఫ్ పాలిటిక్స్ కార్యక్రమాలకు స్పందన రావడంతో మహిళలు, యువతుల సమస్యలు తెలుసుకునేందుకు 'షీ టాక్స్' అనే మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బుధవారం రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌కు చెందిన 45 మంది యువతులతో సమావేశం నిర్వహించి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మనగర్ అర్జున్‌నగర్, అన్నానగర్ పలు బస్తీలకు చెందిన యువతులు, మహిళలు ఉద్యోగాలు చేసేందుకు ప్యారడైజ్, రాణిగంజ్, సికింద్రాబాద్ లోని పలు ప్రాంతాలకు వెళ్తుంటారని వారి కోసం అన్నానగర్ చౌరస్తాలో బస్టాప్ ఏర్పాటు చేయాలని కోరాగా సంబంధిత అధికారులతో చర్చించి బస్టాప్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుధ, సౌజన్య, అనిత, నందిని, అంకిత, దివ్య పాల్గొన్నారు.

చెరువు సుందరీకరణకు నిధులివ్వండి..

కంటోన్మెంట్: తిరుమలగిరి చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించాలంటూ క్రిశాంక్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నేతలు మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ.. తిరుమలగిరి చెరువు సుందరీకరణ, నాలా పనుల విషయంలో బోర్డు నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనైనా చెరువు సుందరీకరణ చేపట్టాలని కోరామన్నారు. ఏడో వార్డు గాంధీ కమ్యూనిటీ హాల్లో కొనసాగుతున్న చెత్త డంపింగ్ యార్డు తరలించేలా ఆర్మీ అధికారులపై ఒత్తిడి తేవాలని కోరామన్నారు. అరవింద్ కుమార్‌ను కలిసిన శ్యామ్ కుమార్, యశ్వంత్ కుమార్, పాండు ఉన్నారు.

రెజ్లర్లను వేధిస్తున్న బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి



ధర్నా చేస్తున్న సీఐటీయు నాయకులు

చిలకలగూడ : భారతీయ రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి మహేందర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్రవ్యాప్త నిరసన పిలుపులో భాగంగా వారాసిగూడ చౌరస్తాలో బుధవారం ధర్నా, నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మ హేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వానికి క్రీడాకారులంటే చులకన భావం ఉందని, దేశానికి పతకాలు అందించిన క్రీడకారుల ప్రాణాలను అరచేతి లో పెట్టుకుని రక్షణ కల్పించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే దీక్షను భగ్నం చేసి క్రీకారులను ఘోరంగా అవమానించిన నరేంద్రమోదీ ప్రభుత్వానికి దేశాన్ని పాలించే అర్హత లేదన్నారు. దేశ గౌరవాన్ని విశ్వవాప్తం చేసిన క్రీడాకారుల పట్ల కేంద్రం వ్యవహరించిన తీరు యావత్ దేశ ప్రజలంతా చూస్తున్నారని, మోదీ ప్రభుత్వానికి సరైన రీతిలో బుద్ధి చెబుతారని అన్నారు. బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామన్నారు. ధర్నాలో మధు, కృష్ణ, పరశరాములు, ఎల్లయ్య, రాములు, నర్సయ్య పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



కృష్ణారెడ్డి

రాంగోపాల్‌పేట్: బస్సు ఎక్కేందుకు వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. తిరుమలగిరి ఇందిరానగర్‌కు చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి కృష్ణారెడ్డి (70) ఆయన భార్య కమలమ్మ ఇద్దరూ కలిసి ఈ నెల 6వ తేదీన ఉప్పల్‌లోని కుమార్తె ఇంటికి వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఉప్పల్ నుంచి సికింద్రాబాద్‌లోని 31 నంబర్ బస్టాప్‌కు వచ్చారు. భార్య కమలమ్మ మంచినీళ్ల బాటిల్ తెచ్చేందుకు వెళ్లగా ఆయన కనిపించకుండా పోయాడు. చుట్టు పక్క వాళ్లను అడిగినా ఎక్కడ ఆచూకీ లభించలేదు. బుధవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాల్లో పరిశీలించగా 21 నంబర్ బస్సెక్కి వెళ్లినట్లు కనిపించింది. కానీ ఎక్కడ దిగాడో.. ఎక్కడికి వెళ్లాడు అనేది తెలియరాలేదు.



గొడుగుల అందజేత

చిలకలగూడ : ఆశావర్కర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని మరిన్ని వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించి ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ నేతృత్వంలో క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆశావర్కర్లకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. ప్రతికూల పరిస్థితుల్లో సైతం చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్న ఆశావర్కర్లకు తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, పద్మారావు, కార్పొరేటర్ సామల హేమ చిత్రాలతో రూపొందించిన గొడుగులను సుమారు 50 మందికి పంపిణీ చేశారు.

బండమైసమ్మనగర్‌లో కార్పొరేటర్ పర్యటన



అధికారులతో కలిసి బండమైసమ్మనగర్‌లో పర్యటిస్తున్న హేమలత

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బండమైసమ్మనగర్ బస్తీలో బుధవారం కార్పొరేటర్ హేమలత జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ బండమైసమ్మనగర్‌ను సందర్శించినప్పుడు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ప్రాంతంలో నీటి ఎద్దడి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆదేశించారు. దీంతో జలమండలి డిప్యూటీ జీఎం శశాంక్, మేనేజర్ సంధ్య, కార్పొరేటర్ హేమలత స్థానికులతో కలిసి అక్కడి సమస్యను తెలుసుకున్నారు. నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై జలమండలి అధికారులతో చర్చించారు. బండమైసమ్మనగర్ బస్తీలో నీటి సమస్య నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గు, మోహన్‌రావు, రామాకాంత్, సాయి, మురళి, వెంకట్, చిన్నా, రజాక్ పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి స్థలం కేటాయించాలి

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ బ్రాహ్మణవాడీ లేన్–5లో రోడ్డు మధ్యలో ఉన్న శ్రీపోచమ్మ దేవాలయ పునః నిర్మాణానికి సమీపంలో స్థలం కేటాయించాలని ఆలయ అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆలయం రోడ్డు మధ్యలో ఉండడంతో పండుగల సమయంలో భక్తుల రద్దీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఆ రహదారిలో రాకపోకలు సాగించే క్రమంలో అసౌకర్యానికి గురవుతున్నారని ఈ నేపథ్యంలో ఆలయాన్ని అక్కడి నుంచి తరలించి భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా పునఃనిర్మించే విధంగా స్థలాన్ని కేటాయించాలని కోరారు.

రేషన్ దుకాణంలో ఆకస్మిక తనిఖీలు



రేషన్‌దుకాణంలో బియ్యం పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

చిలకలగూడ : సీతాఫల్ మండి డివిజన్‌లోని పలు రేషన్ దుకాణాల్లో బుధవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆకస్మిక తనిఖీలు చేశారు. పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులు, తూకం, పని వేళలు తదితర అంశాలపై ఆరా తీశారు. రేషన్ డీలర్లు, వినియోగదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రేషన్ డీలర్ల సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా ఉన్న పద్మారావుగౌడ్, డీలర్ల సమ్మె విషయంలో మంత్రి గంగుల కమలాకర్‌తో చర్చించి సమ్మె విరమించేందుకు కృషి చేశారు. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులుతో చర్చించి రేషన్ డీలర్లతో పాటు వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పద్మారావుగౌడ్ అన్నారు. వినియోగారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా డీలర్లు సంయమనంతో వ్యవహరించాలన్నారు.

ఇవ్వాల్సిన డబ్బులు అడిగినందుకు దాడి

- ఇద్దరికి గాయాలు, ఒకరి రిమాండ్

కంటోన్మెంట్: మిత్రుడికి ఇవ్వాల్సిన డబ్బులు అడిగేందుకు వెళ్లిన వ్యక్తిపై దాడి చేసిన ఘటన మారేడుపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మోహన్ వివరాల మేరకు..మారేడుపల్లి గాంధీనగర్‌లో నివసించే వర్లోళ్ల సందీప్, అరవింద్ మిత్రులు. మంగళవారం రాత్రి అరవింద్, సందీప్‌కు ఫోన్‌చేసి బుసారెడ్డిగూడలోని సన్నీయాదవ్ ఇంటికి వెళ్లి తనకు ఇవ్వాల్సిన రూ.25 వేలు తీసుకురావాలని కోరాడు. అక్కడికి వెళ్లిన సందీప్ అరవింద్‌కు ఫోన్ చేయగా, కాన్ఫరెన్స్ కాల్‌లో సన్నీయాదవ్‌తో మాట్లాడించాడు. ఇంతలోనే సన్నీ యాదవ్ అనుచరులు వచ్చి సందీప్‌ను సమీపంలోని అమ్మవారి ఆలయ ఆవరణలోకి లాక్కెళ్లారు. అక్కడే ఉన్న సన్నీ యాదవ్ నన్నే డబ్బులు అడుగుతావా అంటూ సందీప్ ముఖంపై పిడిగుద్దులతో దాడి చేయగా, అతని అనుచరులు కర్రలతో తల, చేతులపై కొట్టారు. ఆ తర్వాత సన్నీయాదవ్, అరవింద్‌కు ఫోన్‌చేసి బూసారెడ్డి గూడకు రప్పించాడు. ఇంతలోనే అక్కడికి వచ్చిన సన్నీ యాదవ్ భార్య వాళ్లను చంపేయండి అంటూ పెద్దగా అరిచింది. దీంతో సన్నీ వెంటనే బీరు బాటిల్ తీసుకుని అరవింద్ ముఖంపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన అరవింద్, సందీప్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని మారేడుపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు సన్నీ యాదవ్‌తో పాటు అతని భార్య శ్రవంతి, అనుచరులు ధన్‌రాజ్, జోసెఫ్‌లపై కేసు నమోదు చేశారు. బుధవారం సన్నీ యాదవ్‌ను పదో ఏసీఎంఎం కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు.

కిందపడి వృద్ధుడి మృతి

అడ్డగుట్ట: నడుచుకుంటూ వెళ్తుండగా కిందపడిన ఓ వృద్ధుడు మృతి చెందదిన ఘటన తుకారాంగేటు పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు వివరాల ప్రకారం.. అడ్డగుట్ట సీ–సెక్షన్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్‌చారి (61) బుధవారం మద్యంమత్తులో నడుచుకుంటూ వెళ్లి కిందపడ్డాడు. ఎంత సేపటికీ లేవకపోవడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శ్రీనివాస్ చారిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు

అమీర్‌పేట: అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. బాపూనగర్‌కు చెందిన అజయ్‌సింగ్ చౌహాన్ (47) బీకేగూడ ప్రాంతంలో మహిళ పట్ల అనుచితంగా వ్యవహరించడంతో పాటు మాజీ కార్పొరేటర్‌ను అవమానపరిచేలా వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టాడు. బాపూనగర్‌కు చెందిన ఫిక్కీబాయి ఫిర్యాదు మేరకు చౌహాన్‌పై కేసు నమోదు చేశారు.

శాంతి భద్రతల పరిరక్షణలో రాష్ట్రం అగ్రస్థానం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న మంత్రి తలసాని

అమీర్‌పేట: శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసు శాఖ అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.అమీర్‌పేట డివిజన్‌లోని ప్రశాంత్ కాలనీ, ఎస్ఆర్‌టీలో అభివృద్ధి పనులు, ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల నిర్వహణ కమాండ్ కంట్రోల్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమైందని తెలిపారు.సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీలతో 100 శాతం కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కెమెరాల నిమిత్తం నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి గతేడాది రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ ఏడాది రూ.1.20 కోట్లు కేటాయిస్తామన్నారు. ఇంకా మిగిలి ఉన్న కాలనీ, బస్తీల అసోసియేషన్లు 50 శాతం నిధులు సమకూర్చుకుంటే మిగిలిన నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ జోయల్ డేవిస్,ఏపీసీ మోహన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సైదులు, జోనల్ కమిషనర్ రవికిరణ్ పాల్గొన్నారు.

రేపు 'చలో ఉస్మానియా'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ నెల 9న చలో ఉస్మానియా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ పరుశురామ్, కన్వీనర్ డాక్టర్ ధర్మతేజ తెలిపారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ దృష్టికి తమ సమస్యను తీసుకు వెళ్లేందుకు దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 9న ఓయూ ఆర్ట్స్ కాలేజీలో జరిగే రాష్ట్ర మహా సదస్సుకు సుప్రీం కోర్టు రిటైర్ జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. సదస్సుకు రాష్ట్రంలోని 12 వర్సిటీలకు చెందిన 1300 మంది అధ్యాపకులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో డా.వేల్పుల కుమార్, డా.వెంకటేశ్వర్లు, డా.ప్రేమయ్య పాల్గొన్నారు.

న్యూ గాంధీనగర్‌లో త్వరలో బస్తీ దవాఖానా ఏర్పాటు



కమ్యూనిటీహాల్‌ను పరిశీలిస్తున్న శ్యాంకుమార్

రసూల్‌పురా: తిరుమలగిరి న్యూ గాంధీనగర్‌లో త్వరలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయనున్నట్లు కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు శ్యాంకుమార్ తెలిపారు. బుధవారం న్యూ గాంధీనగర్‌లో ఆయన డాక్టర్ రుక్మారెడ్డితో కలిసి బస్తీ దవాఖానా ఏర్పాటు చేసే కమ్యూనిటీహాల్‌ను పరిశీలించారు. సాయన్న హయాంలో బస్తీ దవాఖానా ఏర్పాటు కోసం గతేడాది 13.90 లక్షల మంజూరు కాగా బీజేపీ నాయకులు అడ్డుకోవడంతో ఏర్పాటు కాలేదన్నారు. రాష్ట్ర వైద్య మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి సహకారంతో త్వరలో బస్తీ దవాఖానా సేవలు ప్రజలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్ కుమార్, పాండురంగం, బస్తీ వాసులు పాల్గొన్నారు.